క్లుప్తంగా

రేపు సామాజిక తనిఖీ

నవాబుపేట: మండలంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు బుధవారం సామాజిక తనిఖీ ఉంటుందని ఎంపీడీఓ జయరాంనాయక్, ఏపీఓ జ్యోతి సోమవారం తెలిపారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో తనిఖీ జరుగుతుందని చాలా గ్రామాలు పూర్తి చేశామన్నారు. మండలం మొత్తం 2023 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ వరకు జరిగిన రూ.5 కోట్ల విలువైన పనులకు మండల స్థాయి తనిఖీ జరుగుతుందని, మండలంలోని కూలీలు, ప్రజాప్రతినిధులు అందరూ హాజరు కావాలని సూచించారు.

కలిసికట్టుగా ముందుకు సాగాలి

అడ్డాకుల: గౌడ కులస్తులందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన్‌గౌడ్ అన్నారు. మూసాపేట మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం వద్ద సోమవారం సర్ధార్ సర్వాయి పాపన్న మండల గౌడ సంఘం సమావేశం నిర్వహించారు. ఈనెల 18న సర్ధార్ సర్వాయి పాపన్న జయంతిని అందరు కలిసి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, విజయభాస్కర్‌గౌడ్, బుచ్చన్నగౌడ్, తిరుపతయ్యగౌడ్, రవీందర్‌గౌడ్, శశిధర్‌గౌడ్ ఉన్నారు.

బోనాలకు ఏర్పాట్లు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని చైతన్యనగర్ బంగారుమైసమ్మ దేవాలయంలో 30న బోనాల ఉత్సవం నిర్వహిస్తుండటంతో ఆలయంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ఆలయంలో ఉన్న భారీ వృక్షం కొమ్మలు విద్యుత్ వైర్లకు తగులుతుండటంతో వాటిని క్రేన్ సాయంతో కొట్టివేయించారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



జడ్చర్ల టౌన్: మండలంలోని నసురుల్లాబాద్, ఆలూరు, బాదేపల్లి ఉర్దూ మీడియం, హరిజనవాడ జెడ్పీ హైస్కూల్‌లలో సోమవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాంరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్న పదోన్నతులు, బదిలీలను చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రాజశేఖర్‌రెడ్డి, పురుషోత్తం యాదవ్, సావిత్రి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పశు వైద్యాధికారికి సన్మానం

దేవరకద్ర: మండల పశు వైద్యాధికారిగా పని చేసి బదిలీపై కోయిలకొండకు వెళ్తున్న జీషన్ అలీని సోమవారం ఘనంగా సన్మానం చేశారు. మండలంలోని గ్రామాలకు చెందిన నాయకులు, గొర్రెల పెంపకం దారుల సంఘం ప్రతినిధులు వీడ్కోలు పలికారు. పశు వైద్యాధికారిగా రాంప్రసాద్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సన్మాన సభలో ఆయనకు స్వాగతం పలుకుతూ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆది హన్మంతరెడ్డి, ఉసేనప్ప తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవం



జడ్చర్ల టౌన్: మండలంలోని నాగసాల వద్ద ఉన్న సింగిల్‌విండో గోదాం ఆవరణలో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో డీసీసీబీ ముఖ్య కార్యదర్శి లక్ష్మయ్య మొక్కలు నాటి నీళ్లుపోశారు. కార్యక్రమంలో గార్లపాడ్ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో మానిటరింగ్ ఆఫీసర్ వేణుగోపాల్, వార్డు కౌన్సిలర్ నవనీత, డీసీసీబీ మేనేజర్ జాఫర్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గోస్వామి తులసీదాస్ జయంతి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం రామభక్త హిందీ కవి గోస్వామి తులసీదాస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన రచనల గురించి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. నిర్మలా విద్యార్థులకు తెలియజేశారు. ఆయన రాసిన శ్రీరామ చరితమానస్‌లో నైతిక విలువల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో హిందీ విభాగం అధ్యక్షుడు నర్సింహరావు, కళ్యాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బంద్

దేవరకద్ర/కోయిల్‌కొండ/జడ్చర్ల: బంగ్లాదేశ్‌లో హిందువులపై, దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తు మంగళవారం దేవరకద్ర పట్టణంలో బంద్ నిర్వహిస్తున్నట్లు హిందూ ఐక్య వేదిక సంఘం ప్రకటన విడుదల చేసింది.
కోయిల్‌కొండ బీజేవైఎం ఆధ్వర్యంలో మండలంలో బంద్ పాటిస్తున్నట్లు మండల అధ్యక్షుడు యాదిరెడ్డి తెలిపారు. జడ్చర్ల పట్టణంలో బంద్ నిర్వహిస్తున్నట్లు హిందూ సంఘాల ఐక్య వేదిక ప్రకటించింది. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాహనదారులకు తప్పని ఇక్కట్లు



జడ్చర్ల పట్టణంలోని ఆర్‌యూబీ వద్ద నిలిచిన వాహనాలు

జడ్చర్ల టౌన్: ట్రాఫిక్ జాంతో పట్టణవాసులు తల్లడిల్లుతున్నారు. రెండ్రోజులు సెలవుల అనంతరం సోమవారం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు తెరుచుకోవటంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. సిగ్నల్‌గడ్డపై రోడ్డు విస్తరణ పనులు నెమ్మదిగా సాగుతుండటంతో రోజు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. దానికి తోడు సాయంత్రం పాఠశాలలు ఒకేసారి వదలటంతో గౌడ ఫంక్షన్ హాల్ సమీపంలోని ఆర్‌యూబీ వద్ద ట్రాఫిక్‌జాం అయ్యింది. ఒకే సమయంలో పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాలు, ఆటోలు రావటంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దీనికితోడు నేతాజీచౌరస్తాలోనూ ట్రాఫిక్‌జాం అయ్యింది. జడ్చర్ల క్రాస్‌రోడ్డు వద్ద సైతం ఒకే సమయంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎన్నాళ్లీ కష్టాలంటూ వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించండి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

జడ్చర్ల టౌన్: పురపాలిక అధికారులు, పాలకవర్గం పంతం వీడి తమ సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేష్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈనెల 5 నుంచి తాము అందోళనలు చేపట్టినప్పటికి ఇప్పటి వరకు అధికారులు, పాలకులు తమ సమస్యల పరిష్కారానికి ముందుకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ధర్నాలో మహేష్, కేశవులు, కృష్ణ, శ్యామల, బాలమణెమ్మ, లక్ష్మమ్మ, యాదయ్య, శివ, పాండు, కార్మికులు పాల్గొన్నారు. సమస్యలపై చర్చలు చేద్దామని మున్సిపల్ కమిషనర్ రాజయ్య వెల్లడించారు. తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర నాయకుల సమయం తీసుకుని చర్చలకు వెళ్తామని యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రకటించారు.

గ్యారంటీల పేరిట మోసం చేసిన ప్రభుత్వం

హన్వాడ: ప్రభుత్వం ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కొందరికి మాత్రమే మాఫీ చేశారన్నారు. మహిళలకు రూ.2,500, రూ.500 గ్యాస్ సిలిండర్, తదితర పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వెంకటయ్య, సుదర్శన్‌రెడ్డి, లింగం, వేణు, యాదయ్య, కురుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హజ్రత్ రవూఫ్ బాబా ఉర్సు ప్రారంభం



ప్రార్థనల్లో పాల్గొన్న మత పెద్దలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం వీరన్నపేటలోని హజ్రత్ సయిద్ మహ్మద్ రవూఫ్‌బాబా దర్గా ఉర్సు సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. దర్గాలో గుస్లేషరీఫ్ (జలాభిషేకం) నిర్వహించారు. అనంతరం జల్సా ఫైజానే అవులియల్లా ధార్మిక సభ నిర్వహించగా పలువురు మతపెద్దలు పాల్గొని సందేశాలు ఇచ్చారు. ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన గంధోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. అదే విధంగా మహెఫిలే సమా ఖవ్వాలి కార్యక్రమం ఉంటుంది. వేడుకల్లో దర్గా ముతవల్లీ అబ్దుల్ గఫూర్ నియాజీ, మౌలానా మొహసిన్ పాష ఖాద్రీ, మహ్మద్ ఇబ్రాహీం ఖాద్రీ షర్ఫీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఐ శేఖర్

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సురక్ష పోలీస్ కళా బృందం, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం వారు సోమవారం సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళా బృందం పాటల ద్వారా విద్యార్థులకు వివరించారు. ఎస్‌ఐ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యపై దృష్టి సారించి పట్టుదలతో చదివితే ఉత్తమ భవిష్యత్ లభిస్తుందన్నారు. ముఖ్యంగా యువత గంజాయి మత్తు పదార్థాలు, వ్యసనాలకు అలవాటు పడితే వారి భవిష్యత్ ప్రమాదంలో పడి జీవితం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. రాములు, జగదీష్, వరప్రసాద్, శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కనాయపల్లిలో యువకుల శ్రమదానం



కోయిల్‌కొండ: మండలంలోని కనాయపల్లిలో వివేకానంద యువజనసంఘం ఆధ్వర్యంలో గ్రామంలో శ్రమదానం చేపట్టారు. గ్రామాన్ని ఇంటిలాగా భావించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకుందామని, చెత్తను చెత్తబుట్టలోనే వేయాలని వారు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృష్ణ, రాజు, శ్రీహరి తదితరులు ఉన్నారు.

వ్యవసాయరంగానికి నిధులు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

మహమ్మదాబాద్: కేంద్ర బడ్జెట్‌ను సవరించి వ్యవసాయరంగానికి అధిక నిధులు కేటాయించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీ.లక్ష్మయ్య, కార్యదర్శి వై.లక్ష్మయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ బడా పెట్టుబడిదారులకు నచ్చే విధంగా పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. దేశంలో కార్మికులు పోరాటం ద్వారా సాధిస్తున్న హక్కులను, చట్టాలను రద్దు చేసి కార్మిక కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ కార్మికులకు రైతాంగానికి అనుకూలంగా చట్టాలను చేసి బడ్జెట్‌ను కూడా వారికి అనుగుణంగా తీసుకురావాలని డిమాండ్ చేశారు. విదేశీ కార్పొరేట్‌లకు ఐదు శాతం పన్ను రాయితీ కల్పించడం దుర్మార్గమని, దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం సౌరవిద్యుత్ చట్టాన్ని తీసుకొచ్చి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. రైల్వేలు, ఓడరేవులు, విమానాశ్రయాలు కంపెనీలకు అప్పజెప్పకుండా కేంద్ర ప్రభుత్వంతోనే ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాములు, శేఖర్, వెంకటయ్య, రాజు కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి



నవాబుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

నవాబుపేట: పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలని కోరుతూ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. సోమవారం నాయకులు విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి ప్రతం అంబేడ్కర్ విగ్రహానికి అందించారు. చాలా మంది నిరుద్యోగులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు సైతం రిజర్వేషన్‌లు లేక నష్టపోతున్నారని వారు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నర్సింహులు, ప్రతాప్, ఇందిరాదేవి, గోపాల్, లక్ష్మయ్య, చెన్నయ్య, తాహేర్, మల్లేష్, రూపావతి, సందీప్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

హన్వాడ: మండలంలోని తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు బుద్దిస్ట్ లైట్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బాలకిష్టయ్య, హెచ్ఎం శైలజ, కార్యదర్శి సుభద్ర, రాములు, పాల్గొన్నారు.

కార్మికుల జీతాలను విడుదల చేయాలి



డీపీఓ పార్థసారథికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పంచాయతీ కార్మికుల జీతాలు తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం డీపీఓ పార్థసారథికి వినతి పత్రం సమర్పించారు. నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉండడం వల్ల కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ-కుబేర్ యాప్‌లో డబ్బులు పడడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని వీటన్నిటిని సరిచేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లాలోని ఎంపీడబ్ల్యూ వర్కర్లందరూ వేతనాల కోసం ఇబ్బందులు పడుతున్న విషయమై తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్పెషల్ గ్రాండ్లను ఎక్కడా పెండింగ్ ఉండకుండా విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్‌గౌడ్, నారాయణ పాల్గొన్నారు.

ఇంటి పైకప్పులకు కవర్ల పంపిణీ

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్ల బాధితులకు సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇళ్లపై కప్పేందుకు ప్లాస్టిక్ కవర్లను అందజేశారు. మండల కోఆప్షన్ మెంబర్ మహిమూద్, వెంకటేష్ మాట్లాడుతూ వారం రోజుల క్రితం గ్రామంలో కురిసిన వర్షానికి పాత ఇళ్లు శిథిలావస్థకు చేరి వర్షం నీరు ఇళ్లలోకి వస్తుందని బాధితులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లారన్నారు. ఎమ్మెల్యే స్పందించి ప్రస్తుతానికి ప్లాస్టిక్ కవర్లను పంపించారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, బాల్‌రాజు, శేఖర్, ప్రతాప్, అశోక్, గౌస్ పలువురు ఉన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: కల్వకుర్తి పట్టణంలో విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 2వ జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు డ్రాగన్ షోటోకాన్ అర్బన్ అధ్యక్షుడు ఎస్‌కే.మోసీన్ తెలిపారు. ఆయా విభాగాల్లో గీతిక, రామేశ్వరి, గణేష్, ప్రవీణ్, భానుప్రకాశ్ బంగారు పతకాలు, స్వాతి, నవ్య, లావణ్య, సంగీత, శివ వెండి పతకాలు, నిహారిక, సాయిచరణ్, భానుశ్రీ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం



జడ్చర్లలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: నషాముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం విద్యార్థులచే ప్రిన్సిపాల్ సుకన్య మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల సోషల్ సైన్సెస్ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్-1 సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని, దానివల్ల వారి కుటుంబాలు రోడ్డుమీదకు వస్తున్నాయన్నారు. మత్తుపదార్థాల జోలికి వెళ్లరాదని ప్రతిజ్ఞ చేయించారు.
మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ తిరుపతయ్య మాట్లాడుతూ.. చెడు మార్గంలో ఉన్న వారిని మంచి మార్గంలోకి వచ్చేవిధంగా ప్రతి విద్యార్థి కృషి చేయాలని సూచించారు.
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మాదకద్రవ్యాలు లేని సమాజం ఏర్పడాలని పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పీయూలో ఏర్పాటు చేసిన నషాముక్త్‌భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు జెండాను ఆవిష్కరించారు. పీయూ అధ్యాపకుడు గాలెన్న మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే సంఘం ఏర్పడిందని, మాతృభూమి విముక్తి కోసం కృషి చేసిందన్నారు. స్వేచ్ఛకోసం ఎంతో మంది యువకిశోరాలు బలిదానాలు చేసుకున్నారన్నారు. విద్యారంగ పరిరక్షణ, కామన్ విద్యావిధానం కోసం ఎంతో కృషి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలకిషన్, రాము, లక్ష్మణ్, రాజు, శేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు



దేవరకద్ర: మండలంలోని చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణమాసం రెండో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకారం చేశారు. మండలం కేంద్రంలోని శివాలయం, వీరప్పయ్యస్వామి దేవాలయాలలో అఖండ దీపారాధన కొనసాగిస్తున్నారు. సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించారు.

పోరాటానికి తగిన ఫలితం

మహబూబ్‌నగర్ రూరల్: ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ నేతృత్వంలో 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం చేస్తున్న పోరాటానికి తగిన ఫలితం లభించిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కావలి కృష్ణయ్య అన్నారు. సోమవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ నుంచి మందకృష్ణమాదిగ మంగళవారం హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఆయనకు పెద్దఎత్తున స్వాగతం పలుకడానికి ప్రతి గ్రామం నుంచి తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కంతి ఖాదరయ్య, ఆంజనేయులు, అంజి, కృష్ణయ్య, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు రోడ్డు పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డు సమీపంలోని డంపింగ్‌యార్డు రోడ్డును సోమవారం ఎన్‌హెచ్ఏఐ డీఈఈ రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. వాస్తవానికి డంపింగ్‌యార్డులోని డీఆర్‌సీసీ మీదుగా భూత్పూర్-చించోళి జాతీయ రహదారి వెళ్తోంది. దీంతో డంపింగ్ యార్డుకు సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను మున్సిపల్ కమిషనర్ కోరారు. ఇది లేకపోతే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కాగా, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీఈఈ చెప్పారు.

భర్త, అత్తమామలపై వేధింపుల కేసు నమోదు

జడ్చర్ల: స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన దండోత్కర్ అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త నరేష్, అత్త పద్మ, మామ నాగోజీలపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. భార్య అనూషపై మానసిక, శారీరక వేధింపులకు గురిచేయడంతో పాటు వివాహేతర సంబంధం అంటగట్టే ప్రయత్నం చేసినట్లుగా బాధితురాలు తమకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

న్యాయం చేసేలా జేపీసీలో చర్చించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింలు నష్టపోకుండా జేపీసీ సభ్యురాలిగా న్యాయం చేసేలా చర్చించాలని కోరుతూ పలువురు ముస్లిం సంఘాల ప్రతినిధులు సోమవారం ఎంపీ డీకే అరుణకు జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. వక్ఫ్‌లో సవరణలపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో ముస్లిం వర్గాల్లో ఆందోళన నెలకొందన్నారు. వక్ఫ్ ఆస్తులు, వాటి నిర్వహణ ముస్లింల సంక్షేమానికి ఎంతో ముఖ్యమైనవని, ఈ ఆస్తులు కేవలం ఆర్థికపరమైనవి కాకుండా ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను తెలియజేస్తాయని పేర్కొన్నారు. మిల్లీమహాజ్ ఆధ్వర్యంలో వక్ఫ్ చట్టంలో సవరణలకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టగా విశేష స్పందన లభించినట్లు తెలిపారు. ఖాజ ఫయాజుద్దీన్ అన్వర్‌పాష, తఖీ హుస్సేన్, అబ్దుల్ హాదీ, షేక్ అబ్దుల్లా, ఖుద్దూస్‌బేగ్, హాఫీజ్ ఇద్రీస్ తదితరులు ఉన్నారు.

బస్‌షెల్టర్ కూల్చివేతపై ఫిర్యాదు

హన్వాడ: మండలంలోని మాధారం గేట్ వద్ద నిర్మించిన బస్‌షెల్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ యశోదమ్మ సోమ వారం ఘటనపై కలెక్టర్ విజయేందిరాబోయికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఈవిషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నామన్నారు. బాధ్యులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

ఎన్నికలకు సమాయత్తంకండి



గండేడ్: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ దేవన్న పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు ఎన్నికల శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని వివరాలు సిద్ధం చేసుకోవాలన్నారు. కొత్త ఓటర్లపై దృష్టి సారించాలన్నారు. మార్పులు, చేర్పులతో పాటు ఎన్నికలకు సంబంధించి అన్ని సిద్ధం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీఈఓ నరేందర్‌రెడ్డి, పీఆర్ ఏఈ హసన్ పాల్గొన్నారు.

నోడల్ అధికారులతో డీఈఓ సమీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండల నోడల్ అధికారులతో డీఈఓ రవీందర్ సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రంలోగా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు పూర్తి వివరాలను సమర్పించాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులది కీలకపాత్ర

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: దేశాభివృద్ధిలో ఉపాధ్యాయులది కీలకపాత్ర అని హైదరాబాద్ మఠానికి చెందిన స్థితికానంద మహారాజ్ పేర్కొన్నారు. ఈమేరకు జేపీఎన్‌సీ కళాశాలలో ఉపాధ్యాయులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

గండేడ్: మండలంలోని రుసుంపల్లికి చెందిన గర్భిణి కృష్ణవేణి నెలలు నిండడంతో సోమవారం ఉదయం పురిటి నొప్పులు ప్రారంభం అయ్యాయి. కుటుంబీకులు ఉదయం అంబులెన్స్‌లో గర్భిణిని పీహెచ్‌సీకి బయలుదేరారు. అంచన్‌పల్లి వద్దకు రాగానే నొప్పులు అధికమవడంతో అంబులెన్స్‌ను పక్కకు ఆపి ఆశావర్కర్ అలివేలు, ఈఎంటీ శ్రీనివాస్, పైలెట్ అక్బర్ ఆమెకు పురుడు పోశారు. ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఇద్దరిని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. వారిద్దరు క్షేమంగా ఉన్నారని మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు.

ఎర్ర సత్యంకు ఘన నివాళి



ఎర్ర సత్యం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎర్ర చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి ఎర్ర సత్యం అని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఎర్ర చంద్రశేఖర్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం స్టేషన్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యంచౌరస్తాలోని విగ్రహానికి ఎంపీ డీకే అరుణ, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
■ నవాబుపేటలో ఎర్రసత్యం విగ్రహానికి పూలమాల వేశారు. హన్వాడలో పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎర్రసత్యం చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన మేలును ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరని తెలిపారు.
■ జడ్చర్లలో ఎర్రసత్యం వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన హత్యకు గురైన పాతబజార్ ప్రాథమిక పాఠశాల వద్ద మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ నివాళి అర్పించారు. ఎర్రసత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి, విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎర్ర సత్యం జీవించి ఉన్నంత వరకు బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. ఆయన ఆశయ సాధనకు పాటుపడతామని వెల్లడించారు. బాబీస్ట్రీట్, కావేరమ్మపేట చౌరస్తా, హౌసింగ్‌బోర్డు కాలని, గంగాపురంతోపాటు పలు గ్రామాల్లోనూ నివాళులు అర్పించారు.
■ భూత్పూర్ పట్టణంలోని చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.